క్లుప్తంగా

రైల్వే రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం


ఐఎస్ రాజును సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

దొనకొండ: రైల్వేలో విధులు నిర్వహించి 30 ఏళ్ల కిందట పదవీ విరమణ పొందిన ఐఎస్ రాజు 90వ జన్మదిన వేడుకలు స్థానిక పింఛనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుకు విశ్రాంత రైల్వే ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేకు కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో విశ్రాంత రైల్వే ఉద్యోగుల కార్యదర్శి బి.జయరాజు, రైల్వే పింఛనర్స్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి


ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: విద్యాభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంఈఓ–1 మహ్మద్ ఖాసిం అన్నారు. గురువారం ఆయన ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నూతన ఎంఈవోకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యాభివృద్ధికి కృషి చేస్తానని, ఉపాధ్యాయుల సమస్యలు ఉంటే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపీపీ వెంకటయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. యూనియన్ నాయకులు పూర్ణయ్య, ఏడుకొండలు, కాటంరాజు, దేశానాయక్, వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి సమీపంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గొట్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం రాజ్యలక్ష్మి సమేత తిరుమలనాథస్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు అభిషేకం, అర్చనలు, మంగళ హారతి తదితర పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. రాత్రి శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి కొలువుదీరారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులను మేళతాళాల మధ్య భక్తి పాటలు పాడుకుంటూ భక్తులు ఊరేగింపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

మార్కాపురం టౌన్: జూలై నెల 10వ తేదీన గురుపౌర్ణమి పండగను పురస్కరించుకుని నేటి నుంచి సాయిబాబా మందిరంలో నెలరోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ పేర్కొన్నారు. తొలిరోజు సాయినామ సంకీర్తన నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సాయిభిక్ష కార్యక్రమం, జూన్ 19 నుంచి 25వ తేదీ వరకు సాయిజీవిత చరిత్రపై ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఉపన్యాసాలు, 26 నుంచి జూలై 2 వరకు బాబా జీవిత చరిత్ర అఖండ పారాయణం, జూలై 3 నుంచి 5వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, జూలై 6వ తేదీ షిరిడీ నుంచి వచ్చే బాబా పాదుకల ఊరేగింపు నిర్వహిస్తామని వివరించారు.

జూలై 10వ తేదీన గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా సాయినాథునికి పంచామృతాభిషేకాలు, భక్తులకు అన్న సంతర్పణ, జూలై 11న రథోత్సవం నిర్వహిస్తామని మందిర ప్రధాన కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి పీవీఎల్ఎస్‌వీ నాగరాజు, ఉపాధ్యక్షుడు గోపి, జాయింట్ సెక్రటరీ పవన్‌కుమార్, యూత్ ప్రెసిడెంట్ గోపాలుని కృష్ణమోహన్, కమిటీ సభ్యులు సూర్య నాగేశ్వరరావు, విజయ్, మహిళా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భారతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షకుడు.. భైరవానందస్వామి!


గోవులకు ఆహారం అందిస్తున్న భైరవానంద స్వామి

దొనకొండ: గోవుల ఆలనా పాలనా చూసుకోవటం కన్న తల్లికి సేవ చేయటమేనని భావించాడు ఓ ధర్మకర్త. ఆయనే దొనకొండ అడ్డరోడ్డులోని ఆనంద ఆశ్రమం ధర్మకర్త కాకర్ల భైరవానంద స్వామి. తిండి లేక రోడ్ల వెంబడి బక్క చిక్కి పోయిన గోవులు ఆశ్రమానికి దాతగా ఇచ్చిన గోవులను తీసుకొచ్చి దాతల సహకారంతో 12 ఏళ్లుగా వీరప్పయ్య గోశాల నిర్వహిస్తున్నాడు. పెదన్నపాలెం పంచాయతీ నరసింహానాయునిపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మంగారికి పరమ భక్తుడు భైరవానంద స్వామి. ఆయన స్థానిక అడ్డరోడ్డులో దాతల సహకారంతో ఆనంద ఆశ్రమం ఏర్పాటు చేశారు. దాని ఆవరణలో వీరబ్రహ్మం స్వామికి ఎంతో ఇష్టమైన గోశాలను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు దాతలు సహకారంతో ఉచితంగా అందించిన పశుగ్రాసం గోవులకు ఉపయోగించేవాడు. దొనకొండలో దుకాణాల్లో ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన గోవుల రక్షణ హుండీల ద్వారా వచ్చిన నగదుతో గోవులకు సంరక్షణ చేస్తున్నారు. రోజూ గోవుల సంరక్షణనే తన ధ్యేయమంటూ కాలం గడుపుతున్నాడు. వీరబ్రహ్మేంద్ర స్వామికి శిష్యుడిగా మారిపోయాడు. అంతేకాకుండా దాతల సహకారంతో ఆనంద ఆశ్రమంలో గుడులు, గోపురాలు నిర్మించాడు. ఎవరైనా ఆశ్రమానికి వెళితే అన్నం పెట్టేవారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు దాన ధర్మాలు చేస్తుంటారు.

దాతల సహకారంతో గోశాల ఏర్పాటు



శ్రీ వీరబ్రహ్మేంద్రుల స్వామి వారికి గోవులంటే ఎంతో మక్కువ. ఆయన పేరు మీద గోశాలను ఏర్పాటు చేయాలని భావించి ఏర్పాటు చేశా. గో రక్షణతో సౌభాగ్యం వెల్లివిరుస్తుందని నమ్మకం. గోవుల సంరక్షణకు నా శాయశక్తులా కృషి చేస్తున్నా.

– భైరవానంద స్వామి

ఆశ్రమానికి రోజూ వస్తుంటా



ఇక్కడ ఆశ్రమం ప్రారంభించినప్పటి నుంచి నేను రోజూ వస్తుంటా. ఈ ఆశ్రమం స్వయంగా బ్రహ్మంగారే భైరవానంద స్వామితో ఏర్పాటు చేయించుకున్నారు. ఇక్కడ ఎన్నో మహిమలు చూస్తున్నాం. వీరబ్రహ్మేంద్రుల స్వాముల వారు ధ్యానం చేస్తూ కనిపించటం.. నాగ దేవత బ్రహ్మంగారి ఎదుట నాట్యం చేయటం సీసీ కెమెరాలో చూశాం. ఇక్కడికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వచ్చిన భక్తులు ధ్యానం చేస్తూ ముక్తిని పొందగలుగుతున్నారు.

– మురళీకృష్ణ

అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసం


దొనకొండ: చిన్నారులకు అక్షరాభ్యాసం


దర్శి: అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు


కురిచేడు: సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న నాయకులు

దొనకొండ: స్థానిక బ్రహ్మారావుపేట, వీపీపురం 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా కార్యకర్తలు గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులకు సామూహిక అక్షరాభ్యాసం ప్రయోజనాలు వివరించారు. చిన్న పిల్లల్లో ఆరోగ్య సూత్రాలు చిన్నప్పటి నుంచే నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యకర్తలు షేక్ నసీమా సుల్తానా, లలిత, ఆదిలక్ష్మి, ఆయాలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): దర్శి ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ దర్శి ప్రాజెక్టు సెక్టార్‌లో సామూహిక మెగా అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంఈఓ–2 రమాదేవి, జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. సుమారు 40 మంది పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పిల్లలందరూ మంచి పునాది అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునీత, ఆనందలత, రమాదేవి పాల్గొన్నారు.

కురిచేడు: ఆరోగ్యవంతమైన సమాజం అంగన్‌వాడీతోనే ఆరంభమవుతుందని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు గర్భిణి అయినప్పటి నుంచి వారికి అవసరమైన పోషకాహారం అందిస్తూ తగు సూచనలు, సలహాలు ఇచ్చి నవజాత శిశువు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహిస్తున్నారన్నారు. నవజాత శిశువుకు అవసరమైన ఫీడింగ్‌తో పాటు ఆటపాటలు, అక్షరాలు కూడా అంగన్‌వాడీలోనే ప్రారంభమవుతున్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం అందించాలని కోరారు. పిల్లల ఉన్నతి అంగన్‌వాడీ కేంద్రంలోనే ప్రారంభమవుతుందని తహసీల్దార్ రజనీకుమారి పేర్కొన్నారు. అమ్మఒడి అంగన్‌వాడీ బడి అని, 3 సంవత్సరాలుపైబడిన పిల్లలందరూ అంగన్‌వాడీలోనే తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీఓ శ్రీదేవి సూచించారు. ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, ఎంఈఓ వస్త్రాంనాయక్, సూపర్‌వైజరు సుభాషిణి, షేక్ మస్తాన్‌వలి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేస్తే ప్రజాసమస్యలను పరిష్కరించవచ్చని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఒక సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలు, ప్రజాసమస్యలపై మరుసటి సమావేశం నాటికి తీసుకున్న చర్యలను వివరిస్తే సభకు, ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటుందని జెడ్పీటీసీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎవరి బాధ్యతను వారు సక్రమంగా నిర్వహిస్తే మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంచవచ్చన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులందరికీ రైతు భరోసా వచ్చిందని, నేడు రైతుల్లో సుమారు 4850 మంది ఎలా అనర్హులయ్యారని ప్రశ్నించారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అన్యాయం చేయకుండా పరిశీలించి ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ అందేలా చూడాలని కోరారు. విద్యుత్ స్తంభాలు కొత్తవి ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టర్లు, సిబ్బంది వారి ఇష్టానుసారం వేస్తున్నారని, కొన్ని స్తంభాలు, తీగలు గ్రామానికి తీసుకొచ్చి తిరిగి ఎక్కడకు తీసుకెళ్లారో సమాధానం చెప్పటం లేదని, తమ గ్రామానికి వచ్చిన విద్యుత్ స్తంభాలు, తీగలు వేయకుండా వేరేచోటకు తరలిస్తున్నారని పడమర వీరాయపాలెం సర్పంచ్ ప్రతినిధి బొరిగర్ల చిన గోవిందు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. సూర్య ఘర్ పథకంలో బీసీలకు అదనంగా సబ్సిడీ వస్తుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ రామకృష్ణ కోరారు. ఈ నెల 21న జరగబోయే యోగాంధ్ర కార్యక్రమానికి గ్రామస్థాయి నుంచి పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో విజేతలకు 21వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని, ఈ కార్యక్రమాన్ని అందరూ కలిసి జయప్రదం చేయాలని ఎంపీడీఓ శ్రీదేవి కోరారు. ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

దర్శి (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. దర్శి మండల యూత్ వింగ్ అధ్యక్షుడిగా బండారు నాగపవన్ కుమార్, రైతు విభాగం అధ్యక్షుడిగా మనికొండ వెంకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా అంకాల శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాచపూడి భాస్కరరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నంబూరి కీర్తిరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ జైనులుద్దీన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నగరికంటి ఏసన్న, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా ఎన్. ప్రశాంత్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా గోను వెంగళరెడ్డి, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా పేరం రమేష్‌రెడ్డి, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా పోటు సురేష్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా దేవతి గుప్త, వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా దొంతు వెంకటేష్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా దొండపాటి వెంకటేశ్వరరెడ్డి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా కురంగి శ్రీకాంత్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా పంటా చెన్నారెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా వెన్నా శ్రీనివాసరెడ్డి, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా నలదిమ్ము రమణారెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా అన్నెం సంజీవరెడ్డిలను నియమించారు.

దొనకొండ మండలం..

యూత్ వింగ్ అధ్యక్షుడిగా వడ్లమూడి వీర వెంకటేశ్వర్లు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా తాలూరి లక్ష్మి, రైతు విభాగం అధ్యక్షుడిగా విప్పర్ల చిన్న మల్లయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా పత్తికొండ వెంకట సుబ్బయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వినుకొండ కొండలు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వల్లభ రామారావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మొఘల్ రహంతుల్లా బేగ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గోనె జాకబ్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా యరజర్ల రమేష్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా మువ్వా రమణయ్య, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా గొంగటి పోలిరెడ్డి, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా నాగిరెడ్డి శివారెడ్డి, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా కిన్నెర నాగేంద్ర ప్రసాద్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పరిటాల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా బాపనపల్లి అంజనేయులు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా తమ్మినేని స్వాతి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా ద్వారకచర్ల చెంచిరెడ్డి, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ఎనుబరి మనోహరరాజు, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా పగడాల వీరనారాయణ, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కందుల వెంకటేశ్వరరెడ్డిలను నియమించారు.

కురిచేడు మండలం..

యూత్ వింగ్ అధ్యక్షుడిగా కానాల శివారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మూలె నాగమణి, రైతు విభాగం అధ్యక్షుడిగా ముశికర యోగిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా అంకె వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కేసనపల్లి నాగేశ్వరరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఎం.నాగాంజనేయులు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సయ్యద్ జానీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ముక్తిపూడి స్టాలిన్ పాల్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా తాటి ఏడుకొండలు, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా గొట్టిపాటి రాములు, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా ఆరె శ్రీను, వలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా షేక్ హుస్సేన్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కొత్తమాసు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా సయ్యద్ సుభానీ, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా గోపవరపు శ్రీలక్ష్మి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా పోకూరి వెంకట సుబ్బారావు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా కోలా సంతోష్ కుమార్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా మల్లవరపు ఏసురత్నం, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా కిలారి శరత్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా ఇందూరి సుబ్బారెడ్డిలను నియమించారు.

దర్శి వరకు రైళ్లు నడపాలి


దర్శి రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

దర్శి (కురిచేడు): నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్లో దర్శి వరకు ట్రాక్ పూర్తయినందున రైళ్లు నడపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. దర్శి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ రైల్వే లైన్ దర్శి వరకు పూర్తయినందున ఆగస్టు నుంచి రైళ్లు నడపాలని సీపీఎం జిల్లా నాయకులు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. దర్శిలో జరుగుతున్న రైల్వే పనులను సీపీఎం నాయకులు గురువారం పరిశీలించారు. 2012లో పనులు ప్రారంభించి 2020 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినా ఇప్పటికీ లైన్ మొత్తం పూర్తి కాలేదని పేర్కొన్నారు. 2024లోనే దర్శి వరకు 3 సార్లు రైల్ ట్రయల్ రన్ నిర్వహించారని, రైల్వే ఉన్నతాధికారులు పనులను పరిశీలించి దర్శి వరకు రైళ్లు నడుపుతామని ప్రకటించారని గుర్తుచేశారు. ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసరెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మిలు సంక్రాంతి నుంచి రైళ్లు నడుపుతామని ప్రకటించి 6 నెలలైనా ఇంతవరకు దర్శి ప్రజల కోరిక కలగానే మిగిలి పోయిందని రంగారావు విమర్శించారు. రైల్వే లైను నిర్మాణ పనుల కోసం రూ.2500 కోట్లు అంచనా వేశారని, ఇప్పటికి కేవలం రూ.600 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ఇలా నత్త నడకన పనులు సాగితే ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, రైల్వే ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు దర్శి వరకు యుద్ధప్రాతిపదికన సిగ్నల్ వ్యవస్థ, స్టేషన్ల నిర్మాణాలు పూర్తి చేసి ఈ ఏడాది ఆగస్టు 15న పిడుగురాళ్ల నుంచి దర్శి వరకు రైళ్లు నడిపి దర్శి ప్రజల చిరకాల వాంఛ తీర్చాలని కోరారు. పరిశీలనలో సీపీఎం శాఖ కార్యదర్శులు ఉప్పు నారాయణ, షేక్ కాలేబాషా, ఈమని నాగేశ్వరరావు, ఆర్. రామకోటిరెడ్డి, బలుమూరి అంజిబాబు పాల్గొన్నారు.


పుల్లలచెరువు: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్


మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం

ముండ్లమూరు (కురిచేడు): సన్న బియ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. ముండ్లమూరు ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సన్నబియ్యంలో మంచి ప్రొటీన్స్ ఉన్నాయని, దీంతో ఆరోగ్యానికి మంచిదన్నారు. ఎంఈఓ–2 వెంకటేశ్వర్లుతో కలిసి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం అందజేశారు. ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని కేజీబీవీలో సన్నరకం బియ్యాన్ని అందజేసి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలలకు సన్నరకం బియ్యం అందజేశామని, ఉపాధ్యాయులు దగ్గర ఉండి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలన్నారు. పాఠశాలల విద్యార్థుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్ వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం కావాలి


రైతులకు కరపత్రాలు పంచుతున్న శాస్త్రవేత్తలు

కురిచేడు: ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమయ్యే విధానాన్ని కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త, నోడల్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కురిచేడు మండలం పడమర వీరాయపాలెం, వెంగాయపాలెం గ్రామాల్లో గురువారం ఆయన వ్యవసాయాధికారులతో కలిసి వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో శభాగంగా ప్రీ ఖరీఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌కు రైతులు శాస్త్రవేత్తల సలహాలతో ముందుకు సాగాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూత అందించే వివిధ రకాల పథకాల గురించి వివరించారు. భూసార పరీక్షలను ఖరీఫ్ సాగుకు ముందే చేయించుకొని ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలని డాక్టర్ టి. వెంకటేశ్వరరెడ్డి సూచించారు. రైతులు ముందుగా తమ పొలాలనులో దుక్కులు చేపట్టాలన్నారు. తద్వారా భూమి నుంచి ఆశించే వేరుకుళ్లు తెగుళ్ల నుంచి పంటలు రక్షించుకోవచ్చని, అంతేకాకుండా కలుపును కూడా సమర్థంగా అరికట్టవచ్చన్నారు. పత్తిలో వచ్చే ఎండుతెగులు, మిరపలో వచ్చే వేరుపురుగు, కందిలో వచ్చే కాయ ఈగ, మారుక మచ్చల పురుగు నివారణకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు వివరించారు. ఈ–పంట నమోదు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే వివిధ పథకాల వివరాలను వ్యవసాయాధికారి మధుబాబు వివరించారు. ఖాళీగా ఉన్న భూముల్లో ఫారెస్ట్ జాతికి చెందిన లేదా ఉద్యానవన శాఖకు చెందిన పంటలను సాగు చేస్తే భూ తాపాన్ని తగ్గించి వర్షాలు సకాలంలో కురిసేందుకు దోహదపడవచ్చని తెలిపారు. భూమిలో సేంద్రియ కర్బనం పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. రైతులకు 50 శాతం సబ్సిడీలో పచ్చరొట్ట ఎరువులకు సంబంధించిన విత్తనాలు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆత్మ వ్యవసాయాధికారి, గ్రామాల సర్పంచ్‌లు, వివిధ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమీకృత విధానాలు పాటించాలి


పంటల సాగు గురించి వివరిస్తున్న మానస

దర్శి (కురిచేడు): వ్యవసాయంలో సమీకృత విధానాలు పాటిస్తే రైతుకు మేలు జరుగుతుందని కేవీకే నోడల్ అధికారి టి.మానస పేర్కొన్నారు. దర్శి మండలం రామచంద్రాపురం, కొత్తరెడ్డి పాలెం గ్రామాల్లో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రీ ఖరీఫ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు సాగు ఖర్చులను తగ్గించుకొనే దానిపై దృష్టి సారించాలన్నారు. రైతులను సాంకేతి యాజమాన్య పద్ధతులు పాటించటంపై పోటీపడాలే తప్ప పంటలకు అధిక ఎరువులు వినియోగించటంలో కాదని ఆమె గుర్తుచేశారు. సేంద్రియ ఎరువులకు బదులుగా ఎక్కువగా రసాయన ఎరువులు వినియోగిస్తూ భూసారాన్ని క్షీణింప చేస్తున్నారని తెలిపారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి రైతుపై ఆధారపడి ఉందన్నారు. ప్రతి రైతు ఖరీఫ్ సాగుకు ముందే భూసార పరీక్షలు చేయించుకుని భూసార ఫలితాల ఆధారంగా ఎరువులు సమతుల్యంగా వాడుకోవాలని తెలిపారు. ఒకే మందును, ఒకే పంటను వేస్తే తెగుళ్ల ఎక్కువగా ఆశించడానికి, తెగుళ్ల కారాకాలైన పురుగులు వ్యాధినిరోధక సామర్థ్యాన్ని పెంచుకుంటాయని వివరించారు. పంట మార్పిడి విధానాలను అనుసరిస్తూ అవసరం మేరకే పురుగు మందులు పిచికారీ చేసుకోవాలని, తద్వారా అనవసరమైన ఖర్చులు తగ్గి, లాభాలతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోగలరని ఆమె వివరించారు. సమీకృత వ్యవసాయంలో భాగంగా కోళ్ల పెంచితే రైతులకు వ్యవసాయానికి చేదోడు వాదోడుగా ఉంటుందని కోళ్ల పరిశోధనా శాస్త్రవేత్త డాక్టర్ లెస్లిలియో ప్రిన్స్ తెలిపారు. కోళ్ల పెంపకం చేసేవారు చేపట్టబోయే వారు లాభాలను ఆర్జించాలంటే వ్యాధుల నియంత్రణలో మెళకువలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ–పంట నమోదు, రైతులు సబ్సిడీపై అందజేసే పచ్చరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లిపెసర వివరాలు, వ్యవసాయశాఖ రైతులకు అందజేసే వివిధ పథకాలను, ఈకేవైసీ గురించి మండల వ్యవసాయాధికారి బాలకృష్ణ నాయక్ తెలిపారు. నాగభూషణం, ఆత్మ బీటీఎం పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

గిద్దలూరు రూరల్/రాచర్ల: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని, తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని గిద్దలూరు, రాచర్ల వ్యవసాయాధికారులు భాస్కర్‌రెడ్డి, షేక్.అబ్దుల్ రఫీక్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా లిస్టులో వచ్చిన పేర్లు వచ్చిన రైతులు తమ ఆధార్ కార్డుతో వీఏఏలను సంప్రదించి వేలి ముద్ర వేయాలని సూచించారు.

రామదూత క్షేత్రంలో నందీశ్వరునికి పూజలు

కొనకనమిట్ల: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో నందీశ్వరునికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుడు అకలంకం వెంకటరామ కృష్ణాచార్యులు ఆధ్వర్యంలో విగ్రహదాతలు, భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉభయదాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యక్కంటి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.